సాక్షి
కాకినాడ
శుక్రవారం । 19 । జూలై । 2024



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గండె భరత్‌కుమార్‌రెడ్డి (నందికొట్కూరు) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి ఎస్.శ్రీనివాసరావు (అమలాపురం) గురువారం రూ.20,116 విరాళం అందజేశారు.

నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: స్థానికంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు నీటి విడుదల తగ్గించారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ–కాకినాడ ఇన్‌చార్జి ఉప కులపతి(వైస్ చాన్సలర్–వీసీ)గా సివిల్ ఇంజినీరింగ్ (ఎన్విరాన్‌మెంటల్) ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని వర్సిటీల వీసీలను రాజీనామా చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే అక్టోబర్ నెలాఖరు వరకూ పదవీ కాలం ఉన్నప్పటికీ అప్పటి వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మురళీకృష్ణను వీసీగా నియమించారు. అధ్యాపక వృత్తిలో 34 సంవత్సరాల అనుభవం ఉన్న ఆయన ఫారిన్ వర్సిటీ డైరెక్టర్, నరసరావుపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. 120 పేపర్లు పబ్లిష్ చేసి, ఆరుగురికి పీహెచ్‌డీ గైడ్‌గా వ్యవహరించారు. వర్సిటీలో ఓపెన్ క్లాస్ రూము (జంగిల్ బుక్), నక్షత్రవనం, మియావాకీ వంటి పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులు ఆయన ఆలోచనలతో ఏర్పడ్డాయి. ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ సిటీ: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, రెవెన్యూ, వైద్య, ఆరోగ్యం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తాగునీరు సమస్యలు తలెత్తకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కె.శ్రీరమణి, డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. హౌసింగ్‌పై కలెక్టరేట్‌లో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలకు మెటీరియల్ కేటాయింపులపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తానని, ఈ మేరకు హౌసింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలు క్షేత్ర స్థాయి పర్యటనల సందర్భంగా హౌసింగ్ పురోగతిపై దృష్టి పెట్టాలని సూచించారు. డివిజన్ స్థాయిలో గ్రామాల వారీగా ప్రగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 53,459, కొవ్వూరు డివిజన్‌లో 35,283 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామని అధికారులు వివరించారు.

సేవకు రూపం.. ఆరోగ్య దీపం

- నాణ్యతా ప్రమాణాల్లో బెండపూడి–1 విలేజ్ క్లినిక్ మేటి
- నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్‌లో ప్రథమ స్థానం
- డయేరియా విపత్కర పరిస్థితుల్లోనూ మెరుగైన వైద్యం
- వైద్య రంగంలో జగన్ పాలన మార్కుకు గుర్తింపు



బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ కేంద్ర బృందం (ఫైల్)

తొండంగి: ఒకప్పుడు పేదలు ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోవడం చూశాం... అప్పులు చేసి కుటుంబాలు వీధిన పడటం గమనించాం.. అలాంటి సందర్భాల్లో వైద్యం భారం, దూరం కాకూడని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.. సర్కారీ దవాఖానాలో వైద్యం పొందాలంటే దూరంలోని పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ క్లినిక్‌లను ఇంటి సమీపంలోకే చేర్చారు. వైద్య రంగంలో చారిత్రక మార్పులు తీసుకొచ్చారు. గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సేవలందించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ విలేజ్ క్లినిక్‌లలో శుభ్రత, వైద్య సేవలకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చింది. తొండంగి మండలం రావికంపాడు పీహెచ్‌సీ పరిధిలోని బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌కు జిల్లా ప్రథమ స్థానం ప్రకటించింది. ప్రభుత్వ వైద్య సేవలను పొందడం ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ సచివాలయాలతో పాటు విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. గ్రామంలోనే వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఒక్కో విలేజ్ క్లినిక్‌ను రూ.24 లక్షలతో ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించడంలో సఫలీకృతమవ్వడంతో దీనికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు లభించింది.

పర్యటించి.. గుర్తించి..

నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్)కు చెందిన కేంద్ర బృందం గత జూన్ నెలలో మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించింది. బెండపూడి–1, పెదపూడి మండలం జి.మామిడాడ–3 విలేజ్ క్లినిక్‌లను, పట్టణ ప్రాంతానికి సంబంధించి కాకినాడ ప్రకాశం స్ట్రీట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించింది. ప్రతి విలేజ్ క్లినిక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరు, మందుల నిర్వహణ, వాటి పంపిణీ తదితర ఏడు విభాగాల్లో 44 అంశాలను పరిశీలించి వాటికి రేటింగ్ ఇచ్చింది. ఇందులో బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌కు 92.48 శాతం, జి.మామిడాడ–3 విలేజ్ క్లినిక్‌కు 90.96, కాకినాడ ప్రకాశం స్ట్రీట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 92 శాతం మార్కులు ఇచ్చింది. ఏటా ఎన్‌క్యూఏఎస్ కేంద్ర బృందం ఈవిధమైన సర్వే చేసి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించిన కేంద్రాలకు ప్రత్యేక ధ్రువీకరణ ఇస్తుంది. ఇందులో భాగంగా బెండపూడి–1, జి.మామిడాడ–3 విలేజ్ క్లినిక్‌లతో పాటు ప్రకాశం స్ట్రీట్ ఆరోగ్య కేంద్రాన్ని ఉత్తమమైనవిగా ఎంపిక చేసింది. విలేజ్ క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రమాణాలు పాటించి, గుర్తింపు పొందడం వల్ల ఆయా కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రత్యేకంగా నిధులు కేటాయించనుందని ఎన్‌క్యూఏఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సురేఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ తెలిపారు.

గో గో డయేరియా..

తొండంగి మండలం ఏవీ నగరం పీహెచ్‌సీ పరిధిలోని కొమ్మనాపల్లిలో కొద్ది రోజుల కిందట డయేరియా ప్రబలిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరాల ద్వారా సేవలందించారు. కొమ్మనాపల్లిలో అదుపులోకి వచ్చేలోపు బెండపూడిలోనూ డయేరియా ప్రబలింది. దీంతో దాదాపు 100 మంది వరకూ అనారోగ్యానికి గురవగా పీహెచ్‌సీ వైద్యులు కె.అర్చన, లలిత, ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బంది రేయింబవళ్లు గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో సేవలందించారు. అదే సమయంలో కేంద్ర బృందం రోగులతో ఉన్న బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌ను సందర్శించింది. స్వయంగా రోగులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సర్వే చేసి జిల్లా ప్రథమ స్థానం ప్రకటించింది.



బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌లో సేవలందిస్తున్న వైద్యాధికారి అర్చన, ఇతర సిబ్బంది

మరిన్ని సేవలకు స్ఫూర్తి



వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాలను అనుసరిస్తూ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సిబ్బంది సమన్వయంతో ఎప్పటికప్పుడు సేవలందించేందుకు సమష్టిగా కృషి చేశాం. డయేరియా ప్రబలిన సందర్భంలో బెండపూడి–1 విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన కేంద్ర బృందం ఎన్‌క్యూఏఎస్ గుర్తించి సర్టిఫికేషన్ ఇవ్వడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ఈ గుర్తింపు స్ఫూర్తిని, ప్రోత్సాహాన్నిచ్చింది.

– కె.అర్చన, వైద్యాధికారి, రావికంపాడు పీహెచ్‌సీ, తొండంగి మండలం



విలేజ్ క్లినిక్‌లో రోగులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

సకాలంలో నాడు – నేడు పనులు

- వంటగదులు, మరుగుదొడ్ల పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశం

కాకినాడ సిటీ: మన బడి నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వంటగది, మరుగుదొడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. జిల్లా విద్యా శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని ఎంఈఓలతో కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ మండలాల్లో నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే నోట్‌బుక్స్, ఇతర కిట్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల పరిధిలో డ్రాపౌట్లను గుర్తించి, తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాలతో పాటు సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని ఖాళీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు డీవీ రమణమూర్తి, ఎం.లల్లి, ఎం.విజయశాంతి, సర్వశిక్షా అభియాన్ ఈఈ కె.వెంకటరాజు, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు చర్యలు

కాకినాడ సిటీ: జిల్లాలో కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన చర్యలపై వివిధ శాఖలతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుష్ఠు వ్యాధి గుర్తింపు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ వ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, నివారించాలన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2 వరకూ జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలకు వెళ్లి, ప్రతి విద్యార్థినీ తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఉంటే గుర్తించాలన్నారు. ఈ వ్యాధిని ఎండీటీ చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో కూడా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో సమావేశంలో జిల్లా మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహ నాయక్, దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా భూముల దరఖాస్తులు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: ఆన్‌లైన్‌లో భూముల నమోదు, సబ్ డివిజన్ నిమిత్తం ప్రజల నుంచి అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. అన్ని మండలాల సర్వేయర్లతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దిష్ట కారణం లేకుండా దరఖాస్తులను తిరస్కరించడవద్దని స్పష్టం చేశారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి తగిన కారణాలతో ప్రతి వారం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో సర్వే శాఖ ఏడీ బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ' వీసీగా శ్రీనివాసరావు



నన్నయ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి(వైస్ చాన్సలర్ – వీసీ)గా ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇటీవలి వరకూ వీసీగా ఉన్న ఆచార్య పద్మరాజు.. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఇదే వర్సిటీలో భూగర్భ శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావును ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి 1990లో ఎంఫిల్ చేసిన ఆయన అదే వర్సిటీలో 1990–94లో భూగర్భ జలాలు, జియో మార్ఫాలజీ, పర్యావరణ కాలుష్యం, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్‌పై పీహెచ్‌డీ చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆవిర్భావం నుంచి బోధన విభాగంలో ప్రొఫెసర్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా సమర్థంగా విధులు నిర్వహించారు. సహచరుల సమక్షంలో ప్రొఫెసర్ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

టీచ్ టూల్‌తో ఉత్తమ బోధన

అమలాపురం టౌన్: టీచ్ టూల్ విధానంతో తరగతి గదుల్లో ఉత్తమ బోధన సాకారమవుతుందని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, స్టేట్ సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమలాపురం డివిజన్‌లోని సీఆర్పీలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ స్కూలు అసిస్టెంట్లు, సీఆర్ఎంటీలకు 9 రోజులపాటు శిక్షణ తరగతులు గుణాత్మక విద్యాభివృద్ధి దిశగా జరుగుతాయని మధుసూదనరావు తెలిపారు. శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు వృతి నైపుణ్యాలకు పెంచుకుంటూనే అదే సమయంలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. ఏఎంఓ పిల్లి రాంబాబు, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. అమలాపురం –2, అంబాజీపేట, మామిడికుదురు మండలాల ఎంఈవోలు ఎస్.దుర్గాదేవి, కె.వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణతో పాటు కోనసీమలోని 16 మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం



తనిఖీలకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అమలాపురం టౌన్: విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు 100 మీటర్ల దూరంలో ఉన్న షాపుల్లో సిగరెట్లు అమ్మడం నిషిద్ధమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ సేవించడం చట్ట ప్రకారం నేరమని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లీగల్ కన్సల్టెంట్, పోలీస్, కార్మిక, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ అమలాపురం హైస్కూలు సెంటర్‌లోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్ద గురువారం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావు దొర ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాన్ లెవీ నాయకత్వంలో ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ సాగింది. పాఠశాలలకు సమీపంలో ఉన్న షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు చేసింది. పొగాకు ఉత్పత్తులను అమ్మేందుకు వీలులేదని షాపు యాజమానులకు చెప్పింది. ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో పొగాకు ఉత్పత్తుల నిషిద్ధానికి సంబంధించిన పోస్టర్లను బృందం ప్రతినిధులు విడుదల చేశారు. స్టేట్ లీగల్ కన్సల్టెంట్ పి.శివశంకర్, అమలాపురం ఎస్ఈబీ సీఐ సాయి స్వరూప్, ఎస్సై చంటి, అకౌంట్ ఆఫీసర్ జి.వెంకట శ్రీను పాల్గొన్నారు.

బాల మేధకు మథనం

- 6 నుంచి 11 తరగతుల విద్యార్థులకు అవకాశం
- విద్యార్థి విజ్ఞాన మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైతే స్కాలర్‌షిప్‌తో పాటు ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు సెప్టెంబర్ 15



కాకినాడ సిటీ: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నాయి. తాజాగా 2024–25 విద్యాసంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా పరిధిలో 2,480 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా వాటిలో 2.85 లక్షల మంది వరకూ విద్యార్థులు చదువుతున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

దరఖాస్తు ఇలా..

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుము చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా, సెప్టెంబర్ 15వ తేదీతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షను నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి నుంచే పరీక్షకు హాజరు కావచ్చు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

జూనియర్, సీనియర్ విభాగాల్లో..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 8 తరగతులకు జూనియర్, 9 నుంచి 11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థులు తమకు నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

రాష్ట్ర స్థాయికి ఇలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకు మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. వారిలో ప్రతి తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురు వంతున 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారు.

జాతీయ స్థాయికి ఇలా..

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా వారిని ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు చొప్పున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఆర్ఐఆర్, బీఎఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1 నుంచి 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తారు.

వంద మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ టెస్ట్ అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. ఆ రెండు రోజుల్లో ఏదో ఒక పరీక్షకు ఆన్‌లైన్ పేర్కొన్న సిలబస్ ప్రకారం అనువుగా ఉన్న దానిని రాసుకునే వెసులుబాటు ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు (గంటన్నర) పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి మాత్రమే యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తి ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి నుంచి 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సజ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 10 ప్రశ్నలు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు ఇది చక్కటి వేదిక. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవగాహన పొందేందుకు మంచి అవకాశం. ప్రతి విద్యార్థీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగత లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

– పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

'లింగ నిర్ధారణ'ను దుర్వినియోగం చేస్తే శిక్ష



లింగ నిర్ధారణ పరీక్షలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ప్రక్రియ ద్వారా పిండ లింగ నిర్ధారణ పరీక్షలను దుర్వినియోగం చేసిన వారికి మూడేళ్ల శిక్ష, రూ.10 వేల జరిమానా విధించాలని, ఆయా స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. సంబంధిత చట్టం అమలుపై కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అల్ట్రా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు అక్రమంగా చేసి, ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, నిఘా మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా మూడు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి, ఆరు సెంటర్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు కమిటీ ఆమోదం తెలిపింది. సెంటర్ల చిరునామా, యంత్రాలు, సిబ్బందికి సంబంధించిన మార్పులు, సెంటర్ల మూసివేతకు అనుమతి కోరుతూ అందిన 8 దరఖాస్తులకు అంగీకారం తెలిపింది. గత మార్చి నుంచి అధికారులు 98 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారని కలెక్టర్ తెలిపారు. ఆడశిశు జననాల గణాంకాలను విశ్లేషించి, తక్కువ స్థాయిలో ఉన్నట్లు గమనించిన ప్రాంతాల్లో నిఘా, డెకాయ్ ఆపరేషన్లు మరింతగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా లింగనిర్ధారణ పరీక్షలు జరిగితే జిల్లా కేంద్రంలోని టోల్‌ఫ్రీ నంబర్ 1800–425–3365కు సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతను కలిసిన ఎస్పీలు నరసింహ కిషోర్, కృష్ణారావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్‌): జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను గురువారం తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎస్పీలు డి.నరసింహ కిషోర్, బి.కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు రాజు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామానికి చెందిన దాడిశెట్టి రాజు (28) తన చెల్లెలతో కలిసి సామర్లకోట నుంచి స్కూటీపై స్వగ్రామం వెళుతూ ఉండగా హుస్సేన్‌పురం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. దాంతో స్కూటీ నడుపుతున్న రాజు రోడ్డుపై పడి పోయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీపై ఉన్న ఇద్దరు యువతులకు గాయాలు తగలడంతో హుస్సేన్‌పురం స్థానికుడు చల్లా బుజ్జి 108కు సమాచారం ఇచ్చి, ఆ వాహనంలో వైద్యం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఖాతా నుంచి రూ.40,600 చోరీ

మామిడికుదురు: మామిడికుదురుకు చెందిన కొబ్బరి కాయల వ్యాపారి రజా హుస్సేన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.40,600 చోరీ చేసిన ఘటనపై బాధితుడు గురువారం నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రజా హుస్సేన్ బ్యాంకు ఖాతాకు బుధవారం అప్పనపల్లికి చెందిన కొబ్బరి కాయల వ్యాపారి రూ.50 వేలు జమ చేశారు. దానిలో రూ.10 వేలు మామిడికుదురులో ఏటీఎం ద్వారా హుస్సేన్ డ్రా చేశారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రజా హుస్సేన్ కదలికలను గమనిస్తున్నాడు. ఏటీఎం నుంచి డబ్బులు వచ్చిన తర్వాత నగదు తీసుకునే హడావుడిలో హుస్సేన్ ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎంలోని కార్డు తీసి మీ కార్డు తీసుకోండని వేరే కార్డు హుస్సేన్‌కు ఇచ్చాడు. ఇది గమనించని హుస్సేన్ ఇంటికి వెళ్లిపోయాడు. అతని కార్డు నుంచి పాశర్లపూడి ఏటీఎం నుంచి కొంత, నగరం పెట్రోల బంకు ద్వారా కొంత మొత్తం రూ.40,600 గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. రజా హుస్సేన్ గురువారం మామిడికుదురు ఎస్‌బీఐకి నగదు డ్రా చేసేందుకు వెళ్లగా విషయం బయట పడింది. తాను మోసపోయానని గ్రహించి, నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై పి.సురేష్‌ను వివరణ కోరగా దీనిపై పరిశీలన చేస్తున్నామన్నారు.

రొయ్యకు రెడ్‌గిల్

- పది రోజులుగా ముసురు
- ప్రతికూల వాతావరణంలో ఆక్వా సాగు
- ఆందోళనలో రైతులు



అంతర్వేది రొయ్యల చెరువులో జోరుగా తిరుగుతున్న ఏరియేటర్లు

మలికిపురం: ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లతో ఆక్వా రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ధర కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ జిల్లాలో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఎకరాల్లోని చెరువుల్లోని రొయ్యలకు తెగుళ్లతో రైతులకు తీవ్రంగా నష్టమేర్పడింది. వర్షాల వల్ల ఇప్పటికే వేలాది ఎకరాల్లో రొయ్యలను కౌంట్‌కు రాకుండానే పట్టేస్తున్నారు. ఎండలు పుష్కలంగా కాస్తూ, పొడి వాతావరణం ఉంటే రొయ్యలు ఆరోగ్యంగా పెరిగి రైతులకు సిరులు కురిపిస్తాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు, తోడు ప్రస్తుతం ఇక్కడ మేఘావృతం, ముసురు కూడా అధికంగా ఉంది. దీంతో రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పిల్ల వేసిన 20 రోజులకే చెరువులు వైరస్ బారిన పడుతున్నాయి. పూర్తి స్థాయి కౌంట్‌కు రాకుండా కూడా రొయ్య వైరస్ బారిన పడుతోంది. దీంతో కొన్నిచోట్ల రొయ్యలను ముందుగానే పట్టి రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు. లేదంటే నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. పట్టుబడి పడుతున్న చెరువుల్లో 100 నుంచి 150 కౌంట్ కూడా ఉండడం గమనార్హం. ప్రస్తుతం రొయ్య 30 కౌంట్ ధర రూ.400 వరకూ ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితులలో ఈ కౌంట్ రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులలో 30 కౌంట్ తీయడం కష్టం అని రైతులు అంటున్నారు. లేదంటే మరింత నష్టాల్లో మునిగిపోయే పరిస్థితి. ఈ విధంగా ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది ఎకరాల్లో నష్ట పోయిన రైతులు ఉన్నారు.

రైతులు అందించిన వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో గడచిన పది రోజుల్లో రొయ్య రైతులకు సుమారు రూ.120 కోట్ల మేర నష్టమేర్పడింది. ఎకరానికి రూ.2 లక్షలకు పైగా దాదాపు ఆరు వేల ఎకరాల్లో రొయ్యలు కౌంట్‌కు రాకుండా పట్టుబడి పట్టేయడం వల్ల ఈ నష్టం ఏర్పడింది.

వనామీకి తప్పని వ్యాధుల బెడద

టైగర్ రొయ్యకు వైరస్ బెడద అధికంగా ఉండడంతో రాజోలు దీవిలోని అనేక ఎకరాల్లో రొయ్యల సాగు రైతులు గత పదేళ్లుగా వనామీ రొయ్యలను పెంచుతున్నారు. పెట్టుబడిలో పెద్దగా వ్యత్యాసం లేకపోయినా వ్యాధులకు వనామీ తట్టుకుంటుందన్న ఆక్వా టెక్నీషియన్‌ల సూచనలతో దీని సాగు చేపట్టారు. అయితే మారిన వాతావరణ పరిస్థితులకు వనామీ కూడా వ్యాధులకు గురవుతోంది. లక్షలాది రూపాయలను రొయ్యల సాగు కోసం చెరువుల్లో వేసిన రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం ముసురు కారణంగా రొయ్యకు విబ్రియో (రెడ్‌గిల్), బ్లాక్ గిల్, వైట్ ఫుట్ సోకి రైతులు నష్టపోయారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సఖినేటిపల్లి మండలం గొంది, అంతర్వేదికర దేవస్థానం, రామేశ్వరం, పల్లిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లంక, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, మోరిపోడు, మలికిపురం మండలంలో రామరాజులంక, మలికిపురం, గుడిమెళ్లంక, విశ్వేశ్వరరాయపురం, చింతలమోరి, కత్తిమండ, బట్టేలంక, శంకరగుప్తం, పడమటిపాలెం, గొల్లపాలెం, తూర్పుపాలెం, రాజోలు మండలం శివకోడు, చింతలపల్లి,, మామిడికుదురు మండలం కరవాక, గోగన్నమఠం, మగటపల్లి, లూటుకుర్రు, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ. పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, కాకినాడ జిల్లా తాళ్లరేవు ప్రాంతాలలో రొయ్యల సాగు రైతులు ఈ మేరకు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎకరానికి రూ.5 లక్షలకు పైగా పెట్టుబడి అవుతున్న తరుణంలో సీడ్ వేసిన 30 రోజుల నుంచి వైట్ స్పాట్, రెడ్ గ్రిల్ తదితర వైరస్ సోకి ఇబ్బంది కలిగిస్తోంది. దీని నుంచి రొయ్యలను రక్షించుకోవడానికి చెరువులలో ఏరియేటర్స్‌తో పాటు ఆధునిక పద్ధతులను వినియోగించి ఆక్వా సాగు చేస్తున్నారు. అయితే ఫలితం అంతంత మాత్రమేనని రైతాంగం పేర్కొంటోంది. పైగా విద్యుత్, డీజిల్ ఖర్చు అధికం అవుతోంది.



తెగుళ్ల కారణంగా ముందుగా పట్టేసిన రొయ్యలు

మబ్బులతో ఇబ్బందే



పది రోజులుగా ముసురు, వర్షాల వల్ల చెరువులలో రొయ్యలకు రెడ్‌గిల్ అధికంగా సోకింది. వైట్‌ఫుట్ కూడా ఉంది. రైతులకు చాలా నష్టం ఏర్పడింది.

– మల్లిపూడి సత్తిబాబు, ఆక్వా రైతు, మేడిచర్లపాలెం

ఆక్సిజన్ తగ్గడంతో తెగుళ్లు



వర్షాలు, ముసురు వల్ల చెరువులలో ఆక్సిజన్ తగ్గి రొయ్యలకు తెగుళ్లు సోకుతాయి. స్థానిక మత్స్యశాఖ సిబ్బందిని సంప్రదిస్తే చెరువులలో నీటి శాంపిల్స్ పరీక్షించి తగిన సూచనలు ఇస్తారు. ప్రో బయోటిక్స్ వాడకం ద్వారా చెరువులలో ఆక్సిజన్ శాతం పెంచి తెగుళ్లను నివారించవచ్చు.

– సిద్దార్థ వర్ధన్, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి, రాజోలు

అంతర్వేది ఆలయ ప్రాంగణంలో
చేపల ఈత



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ముంపు నీటిలో ఈదుతున్న చేపలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ ప్రాంగణంలోను, ఆలయ ప్రధాన రహదారిలోను గురువారం ముంపు నీటిలో చేపలు ఈదుతూ భక్తులకు కనువిందు చేశాయి. కురుస్తున్న వర్షాలకు ఆలయ సమీపంలో ఉన్న ఒక చెరువు పొంగి పొర్లి ముంపు నీరు ఆయా ప్రాంతాలలో పోటెత్తింది. దీంతో ముంపు నీటితో పాటు చెరువులోని చేపలు ఈదుతూ ఆలయ ప్రాంగణంలోను, ప్రధాన రహదారిలోను చక్కర్లు కొట్టాయి. గుంపులుగా ముంపు నీటిలో చేపలు ఈదుతూ వెళ్లడాన్ని వారంతా ఎంతో ఆసక్తిగా తిలకించారు.

ఆర్థికంగా పేదనైనా.. విధేయతలో శ్రీమంతుడినే

- రాజకీయాల్లో ఉన్నంత కాలం వైఎస్సార్ సీపీతోనే
- ఎంపీ బోస్



రామచంద్రపురం రూరల్: ఆర్థికంగా పేదనైనా..విధేయతలో అగర్భ శ్రీమంతుడినని రాజకీయాల్లో ఉన్నంత కాలం వైఎస్సార్ సీపీతోనే తన ప్రయాణం ఉంటుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ అన్నారు. ఆయన తెలుగుదేశం పార్టీలోకి వెళతారని గురువారం ఒక పత్రికలో వచ్చిన కథనంపై ఆయన మండిపడ్డారు. తాను అందుబాటులో ఉండే వ్యక్తినేనని తనను ఒక మాట అడిగితే పద్ధతిగా ఉండేదన్నారు. తప్పుడు వార్తలతో తన రాజకీయ జీవితాన్ని కలుషితం చేయవద్దని హితవు పలికారు. ఈ విధంగా వ్యక్తిత్వ హననం చేసే వార్తలు రాయడం మంచి జర్నలిజం అనిపించుకోదన్నారు. రాయవరం మునసబు తనకు రాజకీయాల్లో ఓనమాలు దిద్దిస్తే తనను రాజకీయాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో తానొక పిల్లర్‌గా ఉన్నానన్నారు. వైఎస్ కుటుంబం తనను ఏనాడు తక్కువగా చూడలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా, ఆర్థికంగా తనకు ఎంతగానో అండదండలు అందించారన్నారు. శాసనసభ్యుడిగా, శాసన మండలి సభ్యుడిగా, ఉప ముఖ్యమంత్రిగా, కీలకమైన రెవెన్యూ శాఖ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నో ఉన్నతమైన పదవులు ఇచ్చిన వైఎస్ కుటుంబంలో ప్రతీ ఒక్కరూ తనకు ఎంతో ఇష్టమన్నారు. మంత్రులు, ఇతర నాయకులను ప్రజావసరాల కోసం ఒక్కోసారి కలవాల్సి వస్తుందని, అంతమాత్రాన వేరే పార్టీలో చేరుతున్నట్లు ఊహాగానాలు రాయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను పార్టీని వీడే ప్రసక్తి లేదని మరోసారి తన రాజకీయ జీవితంపై మచ్చ తెచ్చే విధంగా ఎవ్వరూ ప్రవర్తించవద్దని కోరారు.

పేదరికాన్ని రూపుమాపడానికి సుస్థిర లక్ష్యాలు

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- 11 జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: 2030 నాటికి పలు రంగాల్లో పేదరికాన్ని రూపు మాపడానికి కేంద్ర ప్రభుత్వం సుస్థిర లక్ష్యాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని అన్ని డిపార్టుమెంట్లకు చెందిన ఉన్నతాధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. సమస్త విశ్వ శ్రేయోసమృద్ధి కోసం ఒక సమానమైన, న్యాయమైన, సురక్షితమైన ప్రపంచాన్ని రూపొందించడం కోసం 17 సుస్థిర లక్షాలను నిర్ణయించారన్నారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం తొమ్మిది లక్ష్యాలను గుర్తించి వాటిపై ఆయా రాష్ట్రాలల్లో శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని మూడు విస్తరణ శిక్షణ కేంద్రాలలోను మూడు సుస్థిర లక్ష్యాలపై జిల్లా పరిషత్తు, డీఆర్‌డీఏ, డీపీఓ, డ్వామా, సాంఘిక సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయశాఖలలోని ఉన్నతాధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక ఈటీసీలో పేదరికాన్ని నిర్మూలించడం, బాలల కోసం పని చేసి నాణ్యమైన విద్య అందించడం, అందరికీ తాగునీటి వసతి కల్పించడం వంటి అంశాలపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పూరి చేసుకున్న అధికారులు ఆయా జిల్లాలు, మండలాల పరిధిలోని వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి కోసం ఎజెండాను తయారు చేసిందన్నారు. గ్రామ స్థాయిలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు అందేలా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఫ్యాకల్టీలు జీఎస్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు, కె.నిహారిక, బి.వెంకటేశ్వర్లు, చక్రపాణిరావు శిక్షణ నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్‌ఐఆర్‌డీ) అధికారులు ఎస్.శ్రీనివాసరావు, నాగరాజు శిక్షణను పర్యవేక్షించారు.

నొక్కేయడానికి పక్కా ప్లాన్

- అక్రమార్జనపై కూటమి నేతల కన్ను
- మద్యం టెండర్లు, సిండికేట్లతో షాపులు, బారులపై ప్రత్యేక దృష్టి
- ఇసుకతో అక్రమ వ్యాపారానికీ తెరవెనుక సన్నాహాలు
- మారుతున్న విధి విధానాలు తమకు కలిసి వస్తాయని అంచనా
- ముందస్తు ప్రయత్నాలతో పావులు కదుపుతున్న నేతలు



అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటింది. జిల్లాలోని కూటమి పార్టీలకు చెందిన ముఖ్యంగా టీడీపీ, జనసేనలకు చెందిన కొందరు నేతలు మద్యం, ఇసుక వ్యాపారాల ద్వారా అక్రమ ఆదాయ మార్గాలకు బాటలు వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అధికంగా ఆదాయం ఆర్జించిన అనుభవాలతో ఇప్పుడు మారుతున్న మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని మళ్లీ టెండర్లు, సిండికేట్లలో పాల్గొని కొన్ని మద్యం షాపులు, బార్లు దక్కించుకోవాలని పావులు కదుపుతున్నారు. ఉచిత ఇసుక అని ప్రభుత్వం ప్రకటించినా ఆ ఇసుక పేరుతో అక్రమ వ్యాపారాలు చేసేందుకు కూడా వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏడు ఇసుక స్టాక్ పాయింట్లకు సంబంధించి కొన్ని పాయింట్ల నుంచి కూటమి నేతలు ఇసుక పాలసీ రాకముందే కొంత ఇసుకను తరలించుకుని అక్రమార్జనకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఇసుక అక్రమ రవాణాను ఇప్పుడు కట్టడి చేశామని, ఉచిత ఇసుక విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామని జిల్లా అధికారులు చెబుతున్నప్పటికీ రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు, తరలింపులు సాగిపోతున్నాయి. పి.గన్నవరం మండలం, రావులపాలెం మండలాల్లో ఉన్న కొన్ని ర్యాంపుల ద్వారా కూటమి నేతలు అప్పుడే ఇసుక అక్రమ వ్యాపారాలు చేసుకునేందుకు స్కెచ్‌లు సిద్ధం చేసుకుంటున్నారు. లంకల గన్నవరం ర్యాంపుపై ఓ కూటమి నేత ఇప్పటికే కన్నేసి ఆ దిశగా పైరవీలు చేస్తున్నాడు. జిల్లాలో ఉన్న దాదాపు పది ముఖ్యమైన ర్యాంపులపై ఏరియాలు, నేతల వారీగా ఎంపిక చేసుకుని ఆ ర్యాంపు మన కంట్రోల్‌లోకి రాబోతోందని తమ అనుచరులకు చెప్పి ఆ దిశగా ర్యాంపు వద్ద ఇసుకను నిల్వ చేసుకునే స్థలాల అన్వేషణలో పడ్డారు.

మద్యం దుకాణాల టెండర్లు వేసేందుకు తహతహ

కూటమి ప్రభుత్వం త్వరలో కొత్త మద్యం పాలసీని ప్రకటించనుంది. ఇప్పుడు అమలవుతున్న పాలసీని రద్దు చేసి గత టీడీపీ ప్రభుత్వంలో అమలైన పాలసీని మళ్లీ తెరపైకి తెస్తుందన్న అంచనాలతో ఆ రెండు పార్టీలు నేతలు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. మళ్లీ టెండర్లు, సిండికేట్ల విధానం వస్తుందన్న ముందు చూపుతో టెండర్లలో పాల్గొని కొన్ని మద్యం షాపులను ఒడిసి పట్టుకోవాలని తహతహలాడుతున్నారు. మళ్లీ మద్యం సిండికేట్లుగా ఏర్పడి సొమ్ము చేసుకోవాలని ప్లాన్ వేసుకుంటున్నారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల్లో బార్ల లైసెన్స్‌లు సంపాదించేందుకు కొందరు నేతలు ఇప్పటి నుంచే కర్చీఫ్‌లు వేసి ఫలానా బార్‌కు నేను డిపాజిట్ కట్టి టెండర్ ప్రక్రియలో పాల్గొంటానని ముందే ప్రకటించుకుంటున్నారు. ఈ తరహా వ్యాపార ఆకాంక్షలు జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో మరీ ఎక్కువగా ఉన్నాయి. గతంలో మద్యం వ్యాపారాల అనుభవం ఉన్న దాదాపు 20 మంది టీడీపీ, జనసేన నేతలు మద్యం దుకాణాలు, బార్లకు టెండర్లు వేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. మండల కేంద్రాల్లోని మద్యం దుకాణాలకు కూడా టెండర్లు వేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. టెండర్ల ప్రక్రియలో, సిండికేట్లలో తమను కలుపుకోమని ఆ నేతలకు కొందరు తృతీయ శ్రేణి నాయకులు ముందే చెప్పి ఉంచుకుంటున్నారు. కాట్రేనికోన మండలంలోని కొన్ని శివారు గ్రామాల మద్యం దుకాణాలపై కన్నేసిన ఆ నియోజకవర్గానికి చెందిన కొందరు కూటమి నేతలు చాప కింద నీరులా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత మద్యం పాలసీ ప్రకారం ప్రభుత్వం నడుపుతున్న మద్యం అవుట్ లెట్స్ (దుకాణాలు) 81 ఉన్నాయి. పది బార్లు కూడా నడుస్తున్నాయి. ప్రభుత్వం మద్యం పాలసీ మార్పు దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని కూటమి నేతలు అక్రమ ఆర్జనకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు నేతలు తమ మనసులోని మాటను తమ ప్రాంతాల ఎమ్మెల్యేలకు చెప్పుకుంటుంటే... మరి కొందరు నేతల సిండికేట్లుగా మారి ఐక్యతను చాటుతూ కొత్త మద్యం పాలసీని తమ కనుసన్నల్లో నడిపేందుకు గత టీడీపీ ప్రభుత్వ అనుభవాలతో సిద్ధం అవుతున్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి రూ.19 లక్షల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ తదితరులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రాజమహేంద్రవరానికి చెందిన పోతుల వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు రూ.19 లక్షలు విరాళంగా ఇచ్చినట్టు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ తెలిపారు. అంతరాలయం, గర్భాలయంలో సెంట్రల్ ఎయిర్ కండిషనర్ ఏర్పాటు చేసేందుకు ఈ విరాళం ఇచ్చినట్టు చెప్పారు. దాతకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

హుండీల చోరీ దొంగ అరెస్టు



ఆలయంలో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పిఠాపురం: ఆలయంలో హుండీలు చోరీ చేసిన దొంగను గురువారం అరెస్టు చేసినట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కాంప్లెక్స్‌లో గల వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో గతనెల 6వ తేదీ తెల్లవారుజామున దొంగలు తలుపులను బద్దలగొట్టి స్వామి వారి హుండీలను పగులగొట్టి సుమారు రూ.50 నగదును దోపిడీ చేశారు. ఉదయం ఆలయం తెరచి చూసేసరికి హుండీలు పగులగొట్టి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు సిద్ధ వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం అధికారులు ఆలయ పరిసరాల్లో వేలిముద్రలు సేకరించారు. పిఠాపురం మండలం కుమారపురానికి చెందిన గుబ్బల దయానందపాల్ ఆలయాల్లో చోరీలు చేస్తున్నట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. దీంతో గురువారం అతనిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.1,070 మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు కోన వీర లోవకుమార్ (ఫైల్)

శంఖవరం: విద్యుత్ షాక్‌కు గురై శంఖవరంలో గురువారం యువకుడు మృతి చెందాడు. అన్నవరం ఎస్సై ఐ.కిశోర్, వీఆర్వో వాడపల్లి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారు పొలంలో మేకలకు రొట్ట కోస్తుండగా 11 కేవీ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కోన వీర లోవకుమార్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. రోజు కూలీ చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు మేకలను పెంచుకునేవాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఐ.కిశోర్ తెలిపారు.

అంగరలో హత్యకేసు కలకలం

- ఈ నెల 15న వ్యక్తి మృతి, అనంతరం అంత్యక్రియలు
- మామ ఫిర్యాదుతో హత్యకేసుగా నమోదు



అంగరలోని మృతుడి గదిలో సాగిన డాగ్ స్క్వాడ్ తనిఖీ

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో హత్యకేసు కలకలం సృష్టించింది. ప్రశాంతంగా ఉండే గ్రామంలో హత్య ఘటన అలజడిని రేపింది. అంత్యక్రియల అనంతరం మృతిని మామ ఫిర్యాదుతో గురువారం పోలీసులు హత్యకేసు నమోదు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు సాగుతోంతోంది. అంగర ఎస్సై అందె పరదేశి హత్యకేసును నమోదు చేశారు. ఆయన కథనం ప్రకారం... అంగర గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని నున్న నరేష్ (38) ఈ నెల 15 రాత్రి తన ఇంటిలో మృతి చెందాడు. మృతుడు నరేష్‌కు 2013లో కొత్తపేట మండలం వాడపాలెంనకు చెందిన అంధురాలైన బండారు కుసుమ ప్రసన్నతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె కలిగింది. మతి స్థిమితం లేకుండా తిరుగుతుండటంతో భార్య కుసుమ ప్రసన్న, తన కుమార్తెను తీసుకుని భర్తకు దూరంగా వాడపాలెంలోని అమ్మవారి ఇంటిలో ఉంటోంది. 15 రాత్రి నరేష్ చనిపోగా 16న అంత్యక్రియలు చేశారు. తదనంతరం ఇంటి గదిని పరిశీలించగా అత్తమామలకు రక్తపు మరకలు కనిపించాయి. విషయాన్ని వాడపాలెంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. కాగా తన అల్లుడిని హత్యచేశారంటూ మామ బండారు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై వెంటనే స్పందించిన రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌తో కలిసి అంగరలోని ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు నరేష్ గదిని పరిశీలించారు. చుట్టుపక్కల నివాసితులను విచారించారు. డాగ్ స్క్వాడ్ ఇంటి పరిసరాలను పరిశీలించింది. హత్య కోణంలో కేసును విచారిస్తున్నట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు

ఐ.పోలవరం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషుల, మహిళల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఉత్సాహంగా సాగింది. స్థానిక జి.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున ఆగస్టు 10,11,12 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ల నాగరామ ప్రసాద్ తెలిపారు. ఈ ఎంపికలకు ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు జంపా హరికృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు జి.సునీల్‌కుమార్, కమల్, ప్రసాద్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.